సమస్యల పరిష్కారానికి కృషి



మ్యాన్‌హోళ్లను పరిశీలిస్తున్న నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: నరసింహారావునగర్‌లో నెల కొన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని నరసింహారావు నగర్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూగర్భ డ్రైనేజీలో చెత్త పేరుకుపోయి తరచూ మురుగునీరు మ్యాన్‌హోళ్ల నుంచి రోడ్లపై పారుతోందని, అలాగే కాలనీలో ఇంటర్నల్ పోల్స్ లేకపోవడంతో కరెంట్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో మూలమంత్ర జపాలు, మండప పూజలు, పుత్రకామేష్టి యాగం, ప్రదోష పూజలు, సుబ్రహ్మణ్య హోమం, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి ఉమారాణి, దేవాలయ మాజీ చైర్మన్ శివకుమార్, ఆలయ కమిటీ మాజీ సభ్యులు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేచర్‌క్యూర్ ఆస్పత్రికి రోశయ్య పేరుపై హర్షం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సైదాబాద్: బల్కంపేటలోని ప్రభుత్వ నేచర్‌క్యూర్ హాస్పిటల్‌కు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య పేరు పెడుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఐఎస్‌సదన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్యుల ఆశాకిరణమైన కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని బల్కంపేటలో ఏర్పాటు చేసి ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించడం హర్షణీయమన్నారు. అలాగే ప్రభుత్వం తెలుగు విశ్వవిద్యాలయంకు పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని, సాయుధ పోరాట యోధుడు సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును మరో ప్రభుత్వ పథకానికి పెట్టాలని కోరారు.

ఆటో దొంగ రిమాండ్



చాదర్‌ఘాట్: చోరీ చేసిన ఆటోలోనే సంచరిస్తున్న దొంగను చాదర్‌ఘాట్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ వివరాల ప్రకారం.. సైదాబాద్‌కు చెందిన మహ్మద్ హనీఫ్ ఖురేషి (23) ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల10న రాత్రి అక్బర్‌బాగ్‌లో పార్కింగ్ చేసిన ఆటో (టీఎస్12యూఏ7091)ను దొంగిలించాడు. అదే ఆటోలో సంచరిస్తుండగా అజంపురా చౌరస్తా వద్ద అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

షట్టర్ పగలకొట్టి నగదు చోరీ

నాగోలు: ఫర్నిచర్ దుకాణం షట్టర్ పగల కొట్టి రూ. 50 వేల నగదు ఎత్తుకెళ్లిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..చింతల్‌కుంటకు చెందిన చెర్కా సాయికిరణ్ ఎల్‌బీనగర్ శివగంగా కాలనీ కామినేని ఫ్లైఓవర్ పక్కన షిర్డీ సాయి ఎంటర్ ప్రైజర్స్ అనే ఫర్నిచర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ నెల 16 రాత్రి దుకాణం షట్టర్ మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూడగా షట్టర్ పగల కొట్టి ఉంది రూ. 50 వేల నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నర్సు అదృశ్యం

నాగోలు: ఓ నర్సు అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నల్లగొండ జిల్లా, నేరెడ్‌గూమ్‌కు చెందిన అరకంటి అంకిత(20) నాగోలు సుప్రజ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తూ మమతనగర్ కాలనీలో ఉంటుంది. కుటుంబ సభ్యులు ఈ నెల16వ అంకితకు ఫోన్ చేసి ఊరికి రావాలని చెప్పారు. మరోసటి రోజు తల్లి నాగమణి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. ఎన్నిసార్లు చేసిన స్పందించక పోవడంతో హాస్పిటల్ వచ్చి చూడగా అక్కడకు రాలేదని చెప్పారు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నివాసాల నడుమ తుక్కుగోదాం..

భయం గుప్పిట్లో జనం

- తరచూ అగ్ని ప్రమాదాలు
- తరలించాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు



హస్తినాపురం: నివాసాల నడుమ తుక్కుగోదాములు ఏర్పాటుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో తుక్కు గోదాములు ఉండడంతో వేసవి కాలం వచ్చిందంటే ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతుంటారు. నివాసాల నడుమ ఏర్పాటు చేసిన టింబర్ డిపోలు, తుక్కుగోదాములలో ఎప్పుడు అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటాయేనని భయం భయంతో గడుపుతుంటారు.

వారం క్రితం అగ్ని ప్రమాదం

వారం క్రితం కర్మన్‌ఘాట్‌లోని ఓ టింబర్‌డిపోలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అంతే కాకుండా హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాయిప్రకాశ్ నగర్‌కాలనీ, శ్రీరమణ కాలనీ, నందనవనం తదితర ప్రాంతాల్లోని తుక్కుగోదాంలలో తరుచూ అగ్నిప్రమాదాలు జరుగుతూనే ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఏదో ఓ చోట అగ్ని ప్రమాదాలు సంభవిస్తూనే ఉంటాయి. డివిజన్ పరిధోలోని అనేక ప్రాంతాల్లో కట్టెకోత మిల్లులు, తుక్కుగోదాములు ఏర్పాటు చేయడంతో ఆయా కాలనీల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

అధికారులు స్పందించాలి..

నిర్మానుష్య ప్రదేశాలుగా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన తుక్కుగోదాములు ఉన్న ప్రాంతాలలో ప్రస్తుతం పెద్ద సంఖ్యలో నివాసాలు ఏర్పాటు అయినప్పటికీ వాటిని తరలించకపోవడంతో ప్రజలకు సమస్యలు తప్పడం లేదు. కట్టెకోత మిల్లులు ఉన్న ప్రాంతాలలో శబ్ద కాలుష్యంతో డైమండ్ కాలనీ, డిఫెన్స్‌కాలనీ, కర్మన్‌ఘాట్, సాగర్‌ఎన్‌క్లేవ్‌కాలనీ, రెడ్డికాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులుకాని, ప్రభుత్వఅధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాగర్‌రింగ్‌రోడ్డు చుట్టూ ఖాళీ స్థలాల్లో తుక్కు గోదాములు వెలిశాయని ఈ గోదాములకు పలు రకాల కేబుళ్లు వస్తుండటంతో వాటి నుంచి రాగి, ఇనుమును వేరు చేసేందుకు రాత్రి వేళల్లో కాల్చుతున్నారు. దీంతో రాత్రి సమయంలో పొగతో పాటు దుర్వాసన వస్తోంది. కొన్ని సందర్భాల్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి తుక్కుగోదాములలో అగ్ని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.



హస్తినాపురంలోని కర్నూలు జాతీయ రహదారి పక్కన ఉన్న కాలనీలో కుప్పలుగా పడేసిన తుక్కు

తుక్కు గోదాములను తొలగించాలి



హస్తినాపురం డివిజన్ పరిధిలో నివాసాల నడుమ కొనసాగుతున్న తుక్కుగోదాములను తొలగించాలి. సాయిప్రకాశ్‌నగర్ కాలనీ, శ్రీరమణ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉన్న తుక్కుగోదాములతో తరుచూ వాయుకాలుష్యంతో వివిధ రోగాలు సోకుతున్నాయి. తుక్కు గోదాములను నివాసప్రాంతాల నుంచి తరలించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తుక్కు గోదాంలను ఇక్కడి నుంచ తరలించాలి.

చంద్రశేఖర్‌యాదవ్, హస్తినాపురం

సామాజిక సేవ అందరి బాధ్యత

సైదాబాద్: సామాజిక సేవ చేయడం మనందరి బాధ్యతగా గుర్తించాలని జగిని ఫర్నిచర్స్ అధినేత జగిని శ్రీనివాస్ అన్నారు. జగిని ఫర్నిచర్స్, రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైదాబాద్ డివిజన్ ఎస్‌బీహెచ్ కాలనీలోని శ్రీనివాస కమ్యూనిటీహాల్‌లో నిరుపేద మూగ, చెవిటి వధూవరుల వివాహాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగిని శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిరుపేదలైన మూగ, చెవిటి జంట వివాహం జరపాలని తమను సంప్రదించగా పెళ్లికి అవసరమైన తాళి, మెట్టెలు, ఇరువురికి పెళ్లి దుస్తులు అందజేసి వేద పండితులతో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా వివాహం నిర్వహించామన్నారు. చెవిటి మూగ జంటకు వివాహం చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కులమతాలకు అతీతంగా ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలు, దివ్యాంగులు ఎవరైనా తమను సంప్రదిస్తే వారి వివాహాలు దగ్గరుండి జరిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్‌కుమార్, విజయ్‌కుమార్, నర్సింహారావు, వెంకటేష్, సురేష్, బాలరాజు, శ్రీధర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.



వివాహంలో పాల్గొన్న జగిని శ్రీనివాస్, అనిల్‌కుమార్

శంకుస్థాపనల రగడ

- బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నర్సింహారెడ్డి



పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో శంకుస్థాపనల రగడ పెరిగిపోతుంది. కార్పొరేటర్లు, ఎమ్మెల్యే తాము ముందంటే తాము ముందని పోటీపడి శంకుస్థాపనలు చేస్తున్నారు. మన్సూరాబాద్ డివిజన్‌లోని సరస్వతినగర్, వీరన్న గుట్ట, విజయనగర్ కాలనీలలో రూ.60 లక్షలతో చేపట్టనున్న అబివృద్ధి పనులకు ఈ నెల 12న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. తనకు సమాచారం ఇవ్వలేదని స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సోమవారం మరోసారి శంకుస్థాపనకు పూనుకున్నాడు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసనకు దిగారు. కార్పొరేటర్ అక్కడ కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోయాడు.వీరన్న గుట్టలో మరో శంకుస్థాపన ఉండడంతో బీఆర్‌ఎస్ నాయకులు ముందుగానే అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న హయత్‌నగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్ అసభ్య పదజాలంతో దూషించారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. సీఐపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు ఎల్‌బీనగర్ డీసీపీని కలిసి ఫిర్యాదు చేశారు.

సమస్యల పరిష్కారానికి వినతి



జీఎం బలరామ్‌కు వినతిపత్రం ఇస్తున్న పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో నిత్యం డ్రైనేజీ మురుగు నీరు రోడ్లపైన పారుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరని వెంటనే పాడైపోయిన పాత డ్రైనేజీ వ్యవస్థను మార్చి నూతన డ్రైనేజీలైన్‌లను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సోమవారం జలమండలి జనరల్ మేనేజర్ బలరామ్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. కొత్తపేట డివిజన్ పరిధిలో అనేక కాలనీలో డ్రైనేజీ మాన్‌హోళ్లు పడైపోయాయని వెంటనే వాటిని మరమ్మతు చేయించాలని కోరారు. రాజీవ్ గాంధీనగర్ ఫేస్-1లో ప్రజలకు సరైన తాగునీటి సౌకర్యం లేదని వెంటనే సమస్య పరిష్కరానికి చర్యలు తీసుకోవాలన్నారు.

పార్కులను ఆహ్లాదంగా తీర్చిదిద్దుతా



ఓపెన్ జిమ్‌ను పరిశీలిస్తున్న మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని పార్కులను ఆహ్లాదంగా తీర్చిదిద్దుతానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీనగర్ పార్కులో రూ.12 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ సోమవారం కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు వ్యాయమం చేసుకునే విధంగా పార్కులలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ఓపెన్ జిమ్‌ను స్థానికులు వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీధర్ రావు, అమరేంధర్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్‌రావు, కృష్ణరావు, పవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధే లక్ష్యం



సుజాతనాయక్‌ను సత్కరిస్తున్న కాలనీవాసులు

హస్తినాపురం: ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా హస్తినాపురం డివిజన్ అభివృద్ధి ఆపలేరని కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని శివసాయినగర్‌కాలనీలో రూ. 25 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొంతమంది నాయకులు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయకుండా ఇబ్బందులు పెట్టారని అలాంటి వారికి ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు. రాజకీయాలకు అతీతంగా డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా తాను పనిచేస్తున్నానని అందుకు ప్రజలు తమ పూర్తి సహకారాన్ని అందించాలని సుజాతనాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గంగాధర్, హనుమంత్‌రెడ్డి, మమతా మల్లేశ్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చైతన్యపురి: ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ సిటీడిపో నుంచి రాకపోకలు సాగించే సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, సమస్యలు, స్వీకరించేందుకు మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ టి. సమత తెలిపారు. ప్రయాణికులు నేరుగా డీఎంతో మాట్లాడవచ్చన్నారు. సూచనలు, సమస్యలు ఉంటే 9959226137 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

లక్ష్యాలను చేరుకోవడానికి కృషి చేయాలి



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

మలక్‌పేట: లక్ష్యాలను చేరుకోవడానికి నిరంతరం కృషి చేయాలని ఐడియల్ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ వైస్ చైర్మన్ కసిరెడ్డి మాలతిరెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని కాలేజ్‌లో సోమవారం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను దాటుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో తమ విద్యాసంస్థ ముందుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అభివృద్ధికి అడ్డుపడితే ఊరుకోం..

లింగోజిగూడ: అభివృద్ధి విషయంలో ఎవ్వరు అడ్డుపడినా ఉపేక్షించేది లేదని, ప్రజాశ్రేయస్సే తమకు ముఖ్యమని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు.సోమవారం డివిజన్‌లో జరిగిన శంకుస్థాపనల అనంతరం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రొటోకాల్ పాటించకుండా శంకుస్థాపనలు చేశారని ఆరోపించారు. ప్రజాసామ్యబద్ధంగా కాలనీ ప్రజలతో కలిసి శంకుస్థాపన చేస్తుంటే బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు వచ్చి దాడులు చేసేందుకు ప్రయత్నించడం దారుణం అన్నారు. ఈ సమావేశంలో యాదగిరి, రోహిత్, కోటయ్య, రవి, హరిష్‌రెడ్డి, రామేశ్వర్, ఆదినారాయణరెడ్డి, కొండల్‌రెడ్డి, యంజాల్ జగన్, కృష్ణరెడ్డి, శ్రీధర్‌గౌడ్, బాలాజీ, లింగాచారి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మన్సూరాబాద్: నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తూ కుటుంబం గురించి మాట్లాడటం ఎమెల్యే సుధీర్‌రెడ్డికి సబబుగా లేదని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. కార్పొరేటర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఎల్‌బీనగర్‌లో అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద సోమవారం కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన బిడ్డలు రాజకీయాల్లో ఉండకూడదా.. మన్సూరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నన్ను ఉద్దేశించి ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కంటతడి పెట్టారు. ఈ విషయమై ఎస్టీ, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు లింగాల కిషోర్‌గౌడ్, రవీందర్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కళ్లెం సుజాతనాయక్, రాజేశ్వరీ, రామకృష్ణారెడ్డి, రజనీరావు, వసంత, భాను, మణీశ్రీ, అనసూయ, శివకుమార్, సందీష్, గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

దళితులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న మల్లేష్

నాగోలు: రాష్ట్రంలో పెరిగిన జనాభా అనుగుణంగా దళితులకు బడ్జెట్ కేటాయింపులు జరగాలని, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దసరి మల్లేష్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సమావేశం సోమవారం న్యూ నాగోలు కాలనీలో ఎస్‌కే డ్యాంగే భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా జ్యోతి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు వైద్యం ప్రతి మండలంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మించి నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా ఇవ్వాలి డిమాండ్ చేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ రిజర్వేషన్లు ప్రత్యేక చట్టాలు ప్రత్యేక నిధులు తదితర వాటిని సమగ్రంగా అమలు చేస్తే దళిత బతుకులు కొంతైనా బాగుపడతాయని అన్నారు. ఈ సమావేశంలో కుమార్, దేవస్వామి, సురేందర్, శ్రీకాంత్, సరిత, లక్ష్మణ్, మొగిలయ్య పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంలో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

చాదర్‌ఘాట్: తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకంలో వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు కోరారు. సోమవారం వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ఎం.వీరయ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకం లబ్దిదారులకు ప్రభుత్వం ఎస్సీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా విడుదల చేస్తుందని, అలాగే వికలాంగులకు కూడా వికలాంగుల కార్పొరేషన్ ద్వారా విడుదల చేసేలా కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో గోపాల్‌రావు, అందె రాంబాబు, జంగయ్య పాల్గొన్నారు.

డిపో మేనేజర్‌గా పదోన్నతి



చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ సిటీడిపోలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.వెంకన్నకు డిపో మేనేజర్‌గా ప్రమోషన్ వచ్చింది. ఎస్‌టీఐగా కుషాయిగూడలో పనిచేసిన వెంకన్న అసిస్టెంట్ మేనేజర్‌గా పదోన్నతిపై మిధాని, మెహిదీపట్నం, రాజేంద్రనగర్, దిల్‌సుఖ్‌నగర్ డిపోలలో పని చేశారు. ప్రస్తుతం ప్రమోషన్‌తో బదిలీపై వెళుతున్నారు. ఈ సందర్భంగా సోమవారం డిపోలో జరిగిన కార్యక్రమంలో డిపో మేనేజర్ సమత, డిపో సిబ్బంది, పలు యూనియన్ల నాయకులు ఆయనను సత్కరించి వీడ్కోలు పలికారు.

కాంగ్రెస్, బీజేపీ కలిసి ఎమ్మెల్యేను బద్నాం చేయాలని చూస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

లింగోజిగూడ: కాంగ్రెస్, బీజేపీ నాయకులు కలిసి ప్రజలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని అబాసుపాలు చేయాలని చూస్తున్నారని మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆరోపించారు.సోమవారం మన్సూరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేసే సమయంలో అధికారులు, కాలనీవాసులు కార్పొరేటర్‌కు సమాచారం ఇచ్చిన ఇవ్వలేదని అసత్య ప్రచారం చేస్తున్నాడని తెలిపారు.కార్పొరేటర్ తన నిధులు కాబట్టి తానే శంకుస్థాపన చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందని, ఇప్పటివరకు వచ్చిన నిధులలో 95 శాతం ఎమ్మెల్యే తెచ్చిన నిధులేనని అయిన కూడా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే నీతో కలిసి పాల్గొన్నారని గుర్తుచేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కానీ వారిని భయభ్రాంతులకు గురి చేసి కాలనీ వాసులతో రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. బీఆర్‌ఎస్ నాయకుల పట్ల దురుసుగా ప్రవర్తించిన హయత్‌నగర్ సీఐపై చర్యలు తీసుకోవాలని, ఇప్పటికి డీసీపీ ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జక్కిడి మల్లారెడ్డి, జగదీశ్‌యాదవ్‌చ వెంకట్‌రావు, యెల్లేశం భాస్కర్ యాదవ్, చంద్రారెడ్డి, నరసింహయాదవ్, పీ.రవిగౌడ్ పాల్గొన్నారు.